క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటిపాడు: 11కేవీ లైన్ షిఫ్టింగ్‌లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.గురవయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గుజ్జనగుండ్ల, ఎస్వీఎన్ కాలనీలలో సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

గణనాథునికి నృత్య నీరాజనం



గుంటూరు ఎడ్యుకేషన్: శ్యామలానగర్ 9వ లైనులో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అనూ డ్యాన్స్ అకాడమీ చిన్నారుల నృత్య పదర్శన ఆకట్టుకుంది. చిన్నారుల బృందం సంప్రదాయ నృత్యాలతో గణనాథునికి నృత్య నీరాజనం సమర్పించారు.

సామాజిక తత్వవేత్త నారాయణ గురు



నగరంపాలెం: మతాన్ని ప్రజాస్వామీకరించిన సామాజిక తత్వవేత్త నారాయణ గురు అని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవర ప్రసాద్ పేర్కొన్నారు. నారాయణ గురు 171వ జయంతి సభను గురువారం అరండల్‌పేటలోని అమరావతి బుక్ హౌస్‌లో నిర్వహించారు. సభకు చారువాక యువజన సంఘం అధ్యక్షులు చిన్నం డేవిడ్ విలియం అధ్యక్షత వహించారు. మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ నారాయణ గురు శంకరాచార్య అద్వైతాన్ని తీసుకుని, వైకోం పోరాటాన్ని విజయవంతం చేశారని వివరించారు. సభలో డాక్టర్ మూకిరి సుధ, పీపీ మండల్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ టి.కోటేశ్వరరావు, హైకోర్టు న్యాయవాది సంజీవరెడ్డి మార్పుల, భీమ్‌సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపు నీలాంబరం పాల్గొన్నారు.

నిర్మల్ హృదయ్‌లో పండ్లు పంచిన జెడ్పీ చైర్‌పర్సన్



గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పుట్టినరోజు సందర్భంగా గురువారం బ్రాడీపేటలోని నిర్మల్ హృదయ్‌లో పండ్లు పంపిణీ చేశారు. నిర్మల్ హృదయ్‌లో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు, మానసిక వికలాంగుల సమక్షంలో కేక్ కట్ చేసిన ఆమె వారికి పండ్లు, నూతన వస్త్రాలను అందజేశారు. అనంతరం జెడ్పీ ప్రాంగణంలో ఆధునీకీకరించిన పంచాయతీ రాజ్ అతిథి గృహాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు, డెప్యూటీ సీఈవో సీహెచ్. కృష్ణ, ఏవో పాల్, జెడ్పీ మినిస్టీరియల్ ఉద్యోగ సంఘ నాయకుడు కూచిపూడి మోహనరావు, జిల్లా ఇన్‌చార్జ్ పూర్ణచంద్రారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నగరంపాలెం: పెట్రోల్ మంటల్లో తీవ్రంగా గాయపడిన వ్యక్తి జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామిరెడ్డితోటకు చెందిన కె.సురేష్ (28) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. పదేళ్ల కిందట అతను, మీరాబీ ప్రేమ పెళ్లి చేసుకున్నారు. అయితే, సురేష్‌కు పెద్దన్న రమేష్‌తో విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గత శుక్రవారం రాత్రి మణిపురం రైల్వేఓవర్ బ్రిడ్జి సమీపాన సురేష్‌పై పెట్రోలు పోసి రమేష్ నిప్పంటించాడు. మంటల్లో అతను తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన భర్తను మీరాబీ జీజీహెచ్‌లో చేర్పించింది. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. శవ పరీక్షల అనంతరం గురువారం మృతదేహాన్ని పాత గుంటూరు పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారులు వర్సెస్ ప్రజా ప్రతినిధులు

- నగరపాలక సంస్థ అధికారుల తీరుపై మండిపాటు
- చిరువ్యాపారులపై కమిషనర్ ప్రతాపం తగదు
- ప్రమాదకరంగా ఎల్ఈడీ హోర్డింగ్స్
- డీ సిల్టేషన్ పేరుతో దోపిడీ
- కౌన్సిల్‌లో అధికారులను నిలదీసిన పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి
- కమిషనర్ వర్సెస్ ఎమ్మెల్యే అన్నట్లు సాగిన కౌన్సిల్ సమావేశం



సమావేశంలో మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు, అధికారులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ అధికారుల తీరుపై ప్రజా ప్రతినిధులు మండిపడ్డారు. చిరు వ్యాపారులపై కమిషనర్ చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్ సమావేశం గురువారం మేయర్ కోవెలమూడి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైంది. మొత్తం 132 అంశాలపై చర్చ జరిగింది. ఇందులో 61 సభ్యుల ప్రశ్నలు ఉన్నాయి.

చిరు వ్యాపారుల పొట్ట కొడుతున్న వ్యాపారాలు

పోలీస్ పేరెడ్ గ్రౌండ్ ముందు ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేసుకునే వారి పొట్ట కొట్టాలని కమిషనర్ చూస్తున్నారని పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి మండిపడ్డారు. వ్యాపారం చేసుకోనివ్వకుండా వారిని ఇబ్బందులకు గురి చేయడంతో కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేయాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్చిమ ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారుల తీరు వల్ల మంచి ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. అధికారులకు జీతాలు వస్తాయని, చిరు వ్యాపారులు పనులు చేసుకుంటేనే జీవనం గడుస్తుందని పేర్కొన్నారు. రూల్స్ పేరుతో ట్రాఫిక్‌కు అంతరాయం లేని ప్రాంతాల్లో చిరు వ్యాపారులపై నగరపాలక సంస్థ అధికారులు ప్రతాపం చూపుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు.

విచారం వ్యక్తం చేసిన కమిషనర్

స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ పేరెడ్ గ్రౌండ్ ముందు ఇద్దరు చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారని వారిలో ఒకరికి ప్రత్యామ్నాయ స్థలం చూపిస్తే వెళ్లిపోయారని తెలిపారు. ఒక్కరూ మాత్రం అక్కడే ఉంటానని భీష్మించుకుని కూర్చున్నారని, వారికి చాలాసార్లు ఇక్కడ వ్యాపారం చేయకూడదని చెప్పినప్పటికీ వెళ్లలేదని తెలిపారు. రెడ్ జోన్ కాబట్టి వారిని ఆ ప్రాంతం నుంచి వేరో చోటుకు వెళ్లాలని చెప్పినట్లు వివరించారు. ఎమ్మెల్యే మాటలకు చాలా విచారిస్తున్నానని కౌన్సిల్ వేదికగా కమిషనర్ తెలియజేశారు.

వెండింగ్ జోన్స్ ఏర్పాటుపై కసరత్తు

మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వెండింగ్ జోన్స్ ఏర్పాటుపై స్థానిక ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ వెండింగ్ జోన్ కమిటీ ఉందని, ప్రతి ఎమ్మెల్యేతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయలేనని తెలిపారు. కమిటీలో జోన్స్‌పై నిర్ణయం తీసుకుని వచ్చే కౌన్సిల్ నాటికి ఏర్పాటుపై స్పష్టత ఇస్తామని చెప్పారు.

అసమర్థులైన ఏఈలు

పశ్చిమ నియోజకవర్గంలో 15 ప్రాంతాల్లో వీధి దీపాలు లేక అంధకారంగా ఉందని, అల్లరి మూక పెరిగిపోయిందని ఎమ్మెల్యే మాధవి అధికారుల తీరుపై మండిపడ్డారు. సదరు ప్రాంతాల్లో వీధి లైట్లు వేయాలని గత కౌన్సిల్‌లో లిస్ట్ ఇస్తే అందులో ఒకటి, రెండు ప్రాంతాల్లో చేసి చేతులు దులుపుకున్నారని తెలిపారు. ఎలక్ట్రిక్ ఏఈకి ఎన్నిసార్లు ఫోన్లు చేసినా స్పందించరని, అసమర్థులైన ఏఈలను అంటగట్టారని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో మా నియోజకవర్గంలో వీధి లైట్ల సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ వీధి దీపాలకు ప్రత్యేకంగా ఏఈలు లేరని, ఏ ప్రాంతానికి ఆ ప్రాంత ఏఈనే వీధి లైట్ల నిర్వహణ చూస్తున్నారని చెప్పారు. ఎవరైనా పని చేయడంలేదని తన దృష్టికి తీసుకవస్తే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. నగరంలో ప్రమాదకరంగా ఎల్ఈడీ బోర్డులు ఉన్నాయని, ఒక సంస్థకే అన్ని బోర్డులు ఏ విధంగా కేటాయిస్తారని, వీటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే మాధవి ప్రశ్నించారు. సీపీ మాట్లాడుతూ ఎల్ఈడీ బోర్డులకు అనుమతి లేదని, వాటికి కూడా డిమాండ్ రైజ్ చేసి ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డీసిల్టేషన్ పేరుతో దోపిడీకి తెరతీశారని, వీధి కుక్కల నియంత్రణకు జంతు ప్రేమికులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మాధవి సూచించారు.

నోరు పారేసుకున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే

టిడ్కో ఇళ్లల్లో లబ్ధి పొందిన వారే జగనన్న కాలనీల్లోనూ పొందారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఆరోపించారు. జగనన్న కాలనీలు ఊరి బయట ఇచ్చారు..వాటిని స్వాధీనం చేసుకోవాలని అధికారులను కోరారు. దీనికి వైఎస్సార్ సీపీ సభ్యులు బూసిరాజ లత, అచ్చాల వెంకటరెడ్డి, షేక్ రోషన్, కాంట్రకుంట గురవయ్య, మల్లవరపు రమ్య, రామనబోయిన అజయ్, దూపాటి వంశీ, మొహమూద్, అంబేడ్కర్, ఇతర సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆరోపణలను నిరూపించాలని పట్టుబట్టారు. దీనిపై టీడీపీ, వైఎస్సార్ సీపీ సభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో ఎమ్మెల్యే బూర్ల వైఎస్సార్ సీపీ సభ్యులకు అంత ఇంపార్టెంట్ ఇవ్వాల్సిన అవసరం లేదంటూ వారిపై దురుసుగా మాట్లాడారు. తాము కూడా ప్రజల ద్వారా ఎన్నుకోబడిన వారమేనని, ఎలా పడితే అలా మాట్లాడితే చూస్తూ ఊరుకోమని వైఎస్సార్‌సీపీ సభ్యులు ఎమ్మెల్యేకు కౌంటర్ ఇచ్చారు.

ఆర్వోబీ నిర్మాణాన్ని పునఃపరిశీలించాలి



కార్పొరేటర్ ఈచంపాటి కృష్ణమాచారి

ప్రస్తుత శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణాన్ని అధికారులు పునఃపరిశీలించాలని 34వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ బూసి రాజలత కోరారు. గత టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ 8 సంవత్సరాల కిందట బ్రిడ్జి నిర్మాణానికి రూ.160 కోట్లు కేంద్రం నుంచి మంజూరు చేయిస్తే, ఈసారి రూ. 98 కోట్లతో ఏ విధంగా బ్రిడ్జి నిర్మిస్తారంటూ నిలదీశారు. చాలా మంది వ్యాపారులు కోర్టుకు వెళ్లారని, ఈ దశలో బ్రిడ్జి నిర్మాణ చేపట్టడం సమంజసం కాదని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణానికి తామేమి వ్యతిరేకం కాదని, అందరి అభిప్రాయాలతో నిర్మాణం చేపట్టాలని కోరారు. ప్రస్తుత నిర్మాణంపై పునః సమీక్షించాలని డిమాండ్ చేశారు. ఆర్వోబీ నిర్మాణం అయిన తరువాత దానికి ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి ప్రకాశం పంతులు బ్రిడ్జిగా నామకరణం చేయాలని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి) పట్టుబట్టారు. దీన్ని టీడీపీ సభ్యులు వ్యతిరేకించారు. ఆచారి మాట్లాడుతూ గుంటూరు నగరంలో స్వాతంత్ర్య ఉద్యమ పోరాటం ప్రకాశం పంతులు నిర్వహించారని, ఆయన పేరును బ్రిడ్జికి పెట్టడం సమంజసమని తెలిపారు.




శంకర్ విలాస్ ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులపై వివరణ అడుగుతున్న కార్పొరేటర్ బూసిరాజ లత



వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లకు చేయి చూపిస్తూ మాట్లాడుతున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

అన్ని పండుగల్లో విశిష్టం వినాయక చవితి




మల్లికార్జునపేట శివాలయం వద్ద శివుని ఆకృతిలో విఘ్నేశ్వరుడు



విద్యానగర్ మూడో వీధిలో గణపతికి ప్రత్యేక పూజలు



కేవీపీ కాలనీలో వస్త్ర గణపతి అలంకరణలో గణనాథుడు



లాలాపేట రజక వీధిలో..



మారుతీ నగర్ దేవాలయంలో..

ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

నెహ్రూనగర్: అన్ని పండుగల్లో విశిష్టమైనది వినాయక చవితి అని, కులమతాలకు అతీతంగా అందరూ జరుపుకుంటారని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో బుధవారం వినాయకచవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ శుభ కార్యం ప్రారంభించాలన్నా, ముందుగా గణపతి పూజ చేయడం మన సంప్రదాయమని తెలిపారు. విఘ్నాలు తొలగించి జ్ఞానం, బుద్ధి ప్రసాదించే దైవంగా గణపతిని భావిస్తామని అప్పిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ, షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, బూసి రాజలత, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తుల దేవానంద్, పానుగంటి చైతన్య, పరిశపోగు శ్రీనివాసరావు, షేక్ రబ్బాని పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న అంబటి రాంబాబు, నూరిఫాతిమా తదితరులు



స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

శివుని ఆకృతిలో విఘ్నేశ్వరుడు

గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం వద్ద చవితి పందిట్లో శివుని ఆకృతిలో కొలువైన గణనాథుడు భక్తుల పూజలందుకుంటున్నాడు. శిరస్సుపై గంగ, మెడలో సర్పం, చేతిలో త్రిశూలంతో ఆకట్టుకుంటున్న వినాయకునికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో గణనాథుడికి ప్రత్యేక పూజలు

నగరంపాలెం: నగరంలో వినాయకచవితి పండుగను అత్యంత వైభవంగా చేపట్టారు. ప్రధాన రహదారుల వెంట, వీధుల్లో, గల్లీలోనూ భక్తిశ్రద్ధలతో జరిపారు. ఇక ఇళ్లల్లో, బహుళ అంతస్తుల ఆవరణలో గణపతి ప్రతిమలను ప్రత్యేకంగా ప్రతిష్ఠంపజేశారు.

ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. ప్రధాన రహదారుల వెంట పది నుంచి సుమారు 12 అడుగుల ఎత్తుమేరలో వినాయకుడి ప్రతిమలను ప్రతిష్ఠించారు. అర్చకులు, పూజారులతో ప్రత్యేక పూజలు చేయించారు. యువత వినాయక చవితి పందిళ్లు, మండపాలు నెలకొల్పారు. బ్రాడీపేట, అరండల్‌పేట, లక్ష్మీపురం, పట్టాభిపురం, గుజ్జన గుండ్ల, ఎస్వీఎన్ కాలనీ, పాతగుంటూరు, ఆర్టీసీ కాలనీ, లాలాపేట, మార్కెట్ కూడలి, అమరావతి రోడ్ తదితర ప్రాంతాల్లో కొలువైన వినాయకుడ్ని దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు బారులుతీరారు. పందిళ్లు, మండపాలు, దేవస్థానాల నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. రెండో రోజైన గురువారం ఆయా మండపాలు, పందిళ్ల వద్ద గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వస్త్ర గణపతి అలంకరణలో గణనాథుడు

నెహ్రూనగర్: వైఎస్సార్ సీపీ 21వ డివిజన్ కార్పొరేటర్ కాంట్రకుంట గురవయ్య ఆధ్వర్యంలో కేవీపీ కాలనీలో 1/10వ లైనులో 19వ గణపతి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం వస్త్ర గణపతి అలంకరణలో స్వామి పూజలు అందుకున్నారు.

అందరికీ మేలు జరగాలి

పట్నంబజారు: సర్వ విఘ్నాలు తొలగించే ఆ విఘ్నేశ్వరుడి దయతో ప్రతి ఒక్కరికీ మేలు చేకూరాలని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, నగర అధ్యక్షురాలు షేక్ నూరి ఫాతిమా కోరారు. వినాయక చవితి పురస్కరించుకుని తూర్పు నియోజకవర్గంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పాత గుంటూరు, కొత్తపేట, కాకనిరోడ్డు, నందివెలుగు రోడ్డు, నెహ్రూనగర్, నల్లచెరువు, పొన్నూరు రోడ్డు తోపాటు, పలు ప్రాంతాల్లో చవితి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ విఘ్నాలు తొలగించి అందరికీ మంచి చేసే ఆ విఘ్నేశ్వరుడి దయతో అన్ని పనుల్లో ప్రతి ఒక్కరికీ శుభం కలగాలని తెలిపారు. పార్టీ నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా మాట్లాడుతూ తొలి దేవుడికి బ్రహ్మాండమైన పూజలు నిర్వహించి, విశేష పూజా కార్యక్రమాలు, అన్నదాలు చేపట్టడం సంతోషదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, చవితి పందిరి నిర్వాహకులు పాల్గొన్నారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం



నగరంపాలెం: స్థానిక రింగ్ రోడ్ శుభం కన్వెన్షన్ సెంటర్‌లో ప్రత్యేక వస్త్రాల ప్రదర్శన, అమ్మకాలు (నేషనల్ సిల్క్ ఎక్స్‌పో)ను బుధవారం ప్రారంభించారు. ప్రదర్శన వచ్చే నెల రెండో తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. వినాయక చవితి, దసరా, వివాహాది వేడుకలకు అవసరమైన సంప్రదాయ, ఆధునిక ఫ్యాషన్లు, సమ్మిళితమైన విభిన్న వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. దేశంలోని విభిన్న ప్రాంతాల సాంస్కృతిక, సంప్రదాయ వస్త్రాలు, వివిధ రాష్ట్రాల నుంచి మగ్గాలపై తయారైన ఉత్పత్తులు, చేనేత వస్త్ర సంపదను ప్రదర్శనలో వీక్షించవచ్చునని పేర్కొన్నారు. వేలాది రకాల పట్టు, కాటన్ వస్త్రాలు, డిజైనర్ చీరలు, బ్లౌజులు, కుర్తీలను వివిధ రాష్ట్రాల నేత కార్మికులు యాభై శాతం తగ్గింపు ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుందని, ప్రవేశం ఉచితమని నిర్వాహకులు చెప్పారు.

విద్యుత్ ఉద్యమ అమరులకు ఘన నివాళి

లక్ష్మీపురం: విద్యుత్ చార్జీల వ్యతిరేక ఆందోళనలో బషీర్‌బాగ్ షహీద్ చౌక్ వద్ద పోలీసులు జరిపిన కాల్పుల్లో ప్రాణాలు అర్పించిన అమరవీరుల 25వ వర్ధంతి సందర్భంగా వామపక్ష పార్టీల నాయకులు గురువారం ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం, సీపీఐ నగర కార్యదర్శులు కె. నళినీకాంత్, అరుణ్ కుమార్ అధ్యక్షతన 2000 సంవత్సరం , ఆగస్టు 28న జరిగిన విద్యుత్ పోరాటంలో పోలీసుల దమనకాండలో మరణించిన విష్ణువర్ధన్ రెడ్డి, రామకృష్ణ, బాలస్వామి ఫొటోలకు పూలమాలవేసి నివాళులర్పించారు. లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన ప్రతిజ్ఞలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ అమరవీరుల పోరాట బాటను కొనసాగించటమే వారికి నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఒత్తిడితో మరలా తెలుగు దేశం ప్రభుత్వం విద్యుత్ భారాలను ప్రజలపై మోపేందుకు సిద్ధమైందని విమర్శించారు. సామాన్యులు బిల్లులతో సతమతమవుతున్నారని, దీనికి తోడు స్మార్ట్ మీటర్లను బలవంతంగా ఇళ్లకు బిగిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోందని విమర్శించారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు